సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
గురువారం, జూలై 11, 2024
డిజిటల్

# భూ సేకరణలో మానవీయ కోణంతో వ్యవహరించాలి

3 లో



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- రైతులతో కలెక్టర్లు నేరుగా మాట్లాడాలి
- ఆర్ఆర్ఆర్ అంతటికీ ఒకే నంబర్
- ప్రత్యామ్నాయ భూ కేటాయింపులతో అటవీ భూముల స్వాధీనం
- ఎన్‌హెచ్ఏఐ పరిధి సమస్యలపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

జాతీయ రహదారులకు భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం ఎంత ఎక్కువ పరిహారం వస్తుందో అంత రైతులకు దక్కేలా చూడాలన్నారు. తెలంగాణలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదు రవుతున్న సమస్యలపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నా భూ సేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువ ఉండడం, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని కలెక్టర్లు తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి తరతరాలుగా వస్తున్న భూములను రైతులు శాశ్వతంగా కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్లు రైతులతో పిలిచి మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు.

- తెలంగాణ ప్రభ, (హైదరాబాద్)



- మాజీ మంత్రి కేటీఆర్
- మార్పు రావాలి... కాంగ్రెస్ రావాలి అంటే...
- మొత్తానికి పెద్ద మార్పే వచ్చింది
- నాడు కాంగ్రెస్ పాలనలో హాస్టళ్లలో పురుగుల అన్నం.. నీళ్ల చారు..
- ఇప్పుడు బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుక పడిన చట్నీలు

3 లో

# ఇంత మార్పు వస్తుందని ఊహించలేదు

సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ

WANTED

సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయ గలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి
'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'
ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్: 99854 44342



## స్క్రాప్ షాప్ యజమానులు దొంగ సొత్తు కొనవద్దు

### సర్కిల్ ఇన్స్పెక్టర్ మొగిలి

**తెలంగాణ ప్రభ, (తంగళ్ళపల్లి) :** స్క్రాప్ షాప్ యజమానులు దొంగ సొత్తు కొనవద్దని అలా కొంటే నేరం చేసినవారవుతారని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. బుధవారం ఉదయం తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ లో తంగళ్ళపల్లి మండల పరిధిలోని పాత ఇనుప సామాన్లు కొనే షాప్ యజమానులు మరియు ఊరూరా తిరిగి కొనే వర్తకులకు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, తంగళ్ళపల్లి ఎస్సై డి.సుధాకర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి సమావేశంలో పాత ఇనుప సామాన్ వర్తకులను ఉద్దేశించి సీఐ మొగిలి మాట్లాడుతూ.. దొంగ సొత్తుని కలిగి ఉండే వారు అమ్మకానికి వస్తే కొనకూడదని మరియు దొంగ సొత్తుని అమ్మడానికి వచ్చిన వారి వివరాలు పోలీసులకు చేరవేయాలని, షాపులో కొనే ప్రతి వస్తువుకు రిజిస్టర్ మైంటైన్ చేయాలని ఆయన అన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించినట్లైతే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



## భాదిత కుటుంబానికి పరామర్శ

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఏక్లాస్ పూర్ క్యాంప్ రామాలయం గుడి వద్ద పుప్పల పోషవ్వ సాయిలు బైక్ పై నుండు పడి వాహనం అదుపు తప్పి మరణించారు.వారి కుటుంబానికి మాజీ మండల కోఆప్షన్ మెంబర్ ఎంఏ. హకీమ్ పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ.. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మీరు ధైర్యంగా ఉండాలని మనోధైర్యాన్ని కల్పించారు. మరణించిన కుటుంబ పెద్ద కుమారుడు సాయికుమార్ కు ఆయన వంతు 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఎల్లవేళలా మీ కుటుంబానికి నా వంతు సహాయ సహకారాలు ఉంటాయని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. మరణించిన వారి కుమారులు సాయికుమార్, రాము ఎంఏ. హకీమ్ కు ఆర్థిక సాయం అందజేసినందుకు కృతజ్ఞత ధన్యవాదాలు తెలిపారు. జల్లాపల్లి ఫారంలో ఐశ్వర్య అమ్మాయి కడుపు నొప్పితో మరణించడంతో వారి కుటుంబానికి, భోయి లక్ష్మి ద్విచక్ర వాహనం పై పడి మరణించడంతో వారి కుటుంబానికి పరామర్శించే ఆర్థిక సహాయాన్ని అందజేశారు .ఆయన వెంట జల్లాపల్లి ఫారం సీనియర్ నాయకులు షేరు వారి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.





# ఘనంగా కేకే జన్మదిన వేడుకలు

**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) :** కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకులు చౌటపల్లి వేణుగోపాల్ ఆధ్వర్యంలో సిరిసిల్ల కోర్టు సమీపంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకులు న్యాయవాది చౌటపల్లి వేణుగోపాల్ మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రతిక్షణం ప్రజల కోసం తపన పడుతున్న కే కే మహేందర్ రెడ్డి ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకులు కళ్యాణ చక్రవర్తి, గోవరన్ రెడ్డి, పసుల కృష్ణ, ధర్మేందర్, భగవాన్, రాజేష్, వెంకట్ రెడ్డి, నరేష్, చంద్రమౌళి, చంద్రశేఖర్, దేవరాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో..**

సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడి పుట్టినరోజు వేడుకలు కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గాంధీ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి



ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం నర్సయ్య, యేల్లే లక్ష్మీనారాయణ, ఆకునూరి బాలరాజు, మడపు శ్రీదేవి, కాముని వనిత, వేల్పుల స్వరూప తిరుపతి రెడ్డి, కాముని వనిత ,వైద్య శివప్రసాద్ , మ్యన ప్రసాద్, గుండ్ల పెల్లి గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

**తంగళ్లపల్లిలో..**

**తెలంగాణ ప్రభ, (తంగళ్ళపల్లి) :** సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి జన్మదిన రోజు సందర్భంగా సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు ,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీమతి మడుపు శ్రీదేవి ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్టులో మహిళలకు చీరలు,పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, తంగళ్ళపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కామిని వనిత, మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ వెలుముల స్వరూప, ఆడెపు చంద్రకళ, యెల్ల లక్ష్మీనారాయణ, టౌన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, కోడం అరుణ, కోడం సుధ, కొలునూరి రమాదేవి పాల్గొన్నారు.




## గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** పోతంగల్ మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ కళ్యాణ మండపంలో జిల్లా మహిళ సాధికారిత కేంద్ర పరిధిలో మహిళ శిశు దివ్యంగుల , వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు వంద రోజుల ప్రత్యేక అవగాహన శిబిరాలలో భాగంగా బుధవారం మెటర్నిటీ బెనిఫిట్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మిషన్ సమన్వయ కర్త పి.స్వప్న ఆర్థిక అక్షరాస్యత నిపుణులు పుష్ప అంగన్వాడీ సూపర్ వైజర్లు సుమలత, మని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఈ సందర్భంగా జిల్లా మిషన్ సమన్వయ కర్త మాట్లాడుతూ జిల్లా మహిళ సాధికారిత కేంద్ర పరిదిలలో మహిళ శిశు డివ్యంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ పరిధిలో గల గర్భిణీలు బాలింతలకు 100 రోజుల ప్రత్యేక మైన అవగాహన శిబిరాలలో బాగంగా మెటర్నిటీ బెనిఫిట్స్ పై అవగాహణ కల్పించడం జరిగిందన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం ప్రతి గర్భవతులు బాలింతలు తీసుకునే విధంగా తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్య క్రమాలు ప్రతి ప్రాజెక్టులలో కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ అంగన్వాడి టీచర్ పాల్గొన్నారు.

## చెట్ల పెంపకం మానవాళికి అవసరం

### ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** 75వ వనమహోత్సవ కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా కూకట్ పల్లి జోన్ పరిధి జిహెచ్ఎంసి జంట సర్కిళ్లయిన కుత్బుల్లాపూర్, గాజుల రామారం మున్సిపల్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మొక్కలను నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మాట్లాడుతూ భూమిపై చెట్లు విస్తృత స్థాయిలో పెంచినప్పుడే సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులు, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండటంతో పాటు వాతావరణంలోని కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నర్సింహా వివిధ విభాగాల అధికారులు, అర్బన్ బయోడైవర్సిటీ మేనేజర్ రఘువీర్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, స్థానిక సంక్షేమ సంఘాల నాయకులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, దేవరకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# భూ సేకరణలో మానవీయ కోణంతో వ్యవహరించాలి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- రైతులతో కలెక్టర్లు నేరుగా మాట్లాడాలి
- ఆర్ఆర్ఆర్ అంతటికీ ఒకే నెంబర్
- ప్రత్యామ్నాయ భూ కేటాయింపులతో అటవీ భూముల స్వాధీనం
- ఎన్‌హెచ్ఏఐ పరిధి సమస్యలపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**తెలంగాణ ప్రభ, (హైదరాబాద్) :** జాతీయ రహదారులకు భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం ఎంత ఎక్కువ పరిహారం వస్తుందో అంత రైతులకు దక్కేలా చూడాలన్నారు. తెలంగాణలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నా భూ సేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువ ఉండడం, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని కలెక్టర్లు తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి తరతరాలుగా వస్తున్న భూములను రైతులు శాశ్వతంగా కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్లు రైతులతో పిలిచి మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం, ఉత్తర భాగం వేర్వేరుగా చూడొద్దని, ఆ రెండింటికి కలిపి ఒకే నెంబర్ కేటాయించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరగా, ఆయన సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆ ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఎన్ హెచ్ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం (ట్రైపార్టియేట్ అగ్రిమెంట్) కుదుర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. వెంటనే దానిని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్



రెడ్డి ఆదేశించారు.

### స్టే తొలగింపునకు కౌంటర్ దాఖలు చేయాలి

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణలో ఉన్న ఆటంకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అలైన్‌మెంట్ విషయంలో పొరపడి కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారని, దాంతో హైకోర్టు స్టే ఇచ్చిందని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. స్టే తొలగింపునకు వచ్చే శుక్రవారం నాటికి కౌంటర్ దాఖలు చేయాలని కలెక్టర్‌కు ముఖ్యమంత్రి సూచించారు. నాగ్ పూర్-విజయవాడ కారిడార్‌లో ఖమ్మం జిల్లాలో భూ సేకరణ పరిస్థితి ఏమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఖమ్మం సమీపంలోని విలువైన భూముల గుండా రహదారి పోతుందని, పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తల్లాడ-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్నందున, ప్రస్తుతం ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సూచిస్తున్నారని, దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని, జాతీయ రహదారిగానే దానిని కొనసాగించాలని మంత్రి తుమ్మల అభిప్రాయం వ్యక్తం చేశారు.

అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ..నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న రహదారిలో పెద్ద గ్రామాలున్న చోట సర్వీసు రోడ్లు నిర్మించాలని, రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా అవసరమైన చోట్ల అండర్ పాస్‌లు నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి బదులిచ్చారు. జాతీయ రహదారుల వెంట వ్యవసాయ వాహనాలు, రైతులు వినియోగించుకునేలా గ్రావెల్ రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదన సమీక్షలో వచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి తెలిపారు. గ్రావెల్ రహదారి నిర్మించడం వలన రైతులకు ఉపయోగపడడంతో పాటు భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు ఉండవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

### సమన్వయంతో ముందుకు సాగండి..

ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల, విజయవాడ-నాగ్‌పూర్ కారిడార్ రహదారులకు సంబంధించి అటవీ శాఖ భూముల బదలాయింపు సమస్య సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వచ్చింది. స్పందించిన ముఖ్యమంత్రి.. అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని నిజామాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ విషయంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను అటవీ శాఖకు బదలాయించి అటవీ శాఖ భూములను తీసుకొని రహదారుల నిర్మాణానికి ఉన్న ఆటంకాలను తొలగించాలని సీఎం సూచించారు. వివిధ శాఖల పరిధిలోని యుటిలిటీస్ తొలగింపునకు సంబంధించి చెల్లింపులు వేగవంతం చేయాలని, ఏవైనా సమస్యలుంటే ఎన్‌హెచ్ఏఐతో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ -మన్నెగూడ రహదారి పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. అందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు అంగీకరించారు.

### రెండు నెలల్లో హైదరాబాద్-విజయవాడ విస్తరణ పనులు

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల విస్తరణ పనులకు భూ సేకరణ పూర్తయినందున వెంటనే పనులు చేపట్టాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్ చౌదరిని కోరారు. రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన బదులిచ్చారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ఓఎస్డీలు శేషాద్రి, మాణిక్ రాజ్, చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, మౌలిక వసతుల సలహాదారు శ్రీనివాసరాజు, ఎన్ హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి రజాక్, పీసీసీఎఫ్ డోబ్రియల్, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన, జాయింట్ సెక్రటరీ హరీష్, మెదక్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నిజామాబాద్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంత మార్పు వస్తుందని ఊహించలేదు

## మాజీ మంత్రి కేటీఆర్

**తెలంగాణ ప్రభ, (హైదరాబాద్) :** మార్పు రావాలి... కాంగ్రెస్ రావాలంటూ పలికి మొత్తానికి కాంగ్రెస్ వాళ్లు వచ్చారని... అలాగే వారు చెప్పినట్లుగా పెద్ద మార్పే తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'జేఎన్టీయూ మెస్ చట్నీలో చిట్టెలుక' అనే వార్తా క్లిప్పింగ్‌ను ఆయన జోడిస్తూ... కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఆనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో దుస్థితి.. పురుగుల అన్నం.. నీళ్ల చారు.. ఈనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో ఇంకా అధ్వాన పరిస్థితి.. బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుకలు తిరిగే చట్నీలు అంటూ ఎద్దేవా చేశారు. మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదంతమైందని... నిన్న కోమటిపల్లి హాస్టల్లో ఉప్మాలో బల్లి పడి 20 మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారని గుర్తు చేశారు. సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ హాస్టల్‌లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో ఇక్కడి విద్యార్థులు బెంబేలెత్తారన్నారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరు? అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడ? అని ప్రశ్నించారు. కలుషిత ఆహారం వల్ల... పిల్లలు ఆడుకోవాల్సిన వయస్సులో ఆసుపత్రుల పాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్తవ్యస్తంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే విద్యార్థులకు ఈ అవస్థ వచ్చిపడిందని... దీంతో వారికి ఈ అస్వస్థత అని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరవాలని లేదంటే భావిభారత పౌరుల నిండు ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. వైఫల్యాలను సరిచేయకపోతే ఊహించని విషాదం చోటు చేసుకునే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు.



## సమస్యలు పరిష్కరించకపోతే

# చేనేత జౌళిశాఖ కార్యాలయం ముట్టడిస్తాం

**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) :** సిరిసిల్లలో సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 15 చేనేత జౌళి శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని లాల్ బావుట చేనేత కార్మిక సంఘం నాయకులు పంతం రవి అన్నారు. బుధవారం కార్మిక భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లాల్ బవుట చేనేత కార్మిక సంఘం నాయకులు పంతం రవి మాట్లాడుతూ సిరిసిల్ల నేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతంలో పలుమార్లు ముఖ్యమంత్రికి విన్నవించామని తెలిపారు. ఇప్పటికైనా సమస్యలకు పరిష్కారం చూపని పక్షంలో రానున్న 15వ తేదీన చేనేత జౌళి శాఖ కార్యాలయాన్ని ముష్టి ముట్టడిస్తామని తెలిపారు. సమావేశంలో వేణు, సోమ నాగరాజు, సదానందం, రాజమల్లు పాల్గొన్నారు.



# సీజనల్, కిటక జనిత వ్యాధులపై అవగాహన సదస్సు

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల కేంద్రంలో యశశ్రీ పాఠశాలలో మండల ఆరోగ్య అధికారి సిర్ప గోవర్ధన్ విద్యార్థులకు సీసనల్ వ్యాధులు, కిటక జనిత వ్యాధుల పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. ఇంటి పరిసరాలలో పాత కుండీలో, కొబ్బరి బొండాలలో, పగిలిన వస్తువులలో నీరు నిలవ ఉండకుండా జాగ్రత్తలుతీసుకోవాలన్నారు. పరిశుభ్రమైన నీరు త్రాగాలని తెలిపారు. సీసనల్ వ్యాధులు, దోమల ద్వారా వచ్చే వ్యాధులు, కలుషితం కలిగిన నీరు వల్ల వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియచేసి అవగాహన కలిగించటం జరిగింది. ఈ కార్యక్రమంలో యశశ్రీ ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఆరోగ్య సిబ్బంది రోజా, మంజుల ఆశ వర్కర్లు అనురాధ, గంగామణి, స్వప్న పాల్గొన్నారు.

సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ



# ఆ స్టార్ హీరో మూవీలో ఛాన్స్ కొట్టేసిన కృతిశెట్టి

ఉప్పెన సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది కృతి శెట్టి. తొలి సినిమాతోనే తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆ సినిమా తర్వాత నేచురల్ స్టార్ నానితో కలిసి శ్యామ్ సింగరాయ్ సినిమాలో నటించింది. తొలి సినిమాలో పద్దతిగా కనిపించిన కృతి. ఈ సినిమాలో కాస్త బోల్డ్ గా కనిపించి ఆకట్టుకుంది. ఆతర్వాత బంగార్రాజు సినిమాతో మరో హిట్ అందుకుంది. ఇలా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న కృతికి ఆ తర్వాత వరుసగ ఫ్లాప్స్ పడ్డాయి. ఇక రీసెంట్ గ శర్వానంద్ తో కలిసి నటించిన మనమే మూవీ కూడా మిక్సడ్ టాక్ రావడంతో ఇప్పుడు తెలుగులో ఆఫర్స్ కరువయ్యాయి. అయితే తాజాగా ఆమెకు ఒక స్టార్ హీరో సరసన ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. తమిళ దర్శకుడు సెల్వమని సెల్వరాజ్ దర్శకత్వంలో తన తదుపరి చిత్రాన్ని దుల్కర్ చేయబోతున్నట్లు సమాచారం. ఇక ఈ సినిమాకి ''కాంత'' అనే టైటిల్ ఖరారు చేసారు చిత్ర యూనిట్. ఈ సినిమాలో దుల్కర్‌కి జోడీగా కృతిని ఎంపిక చేసినట్లు సమాచారం. టాలీవుడ్ హీరో రానాకు చెందిన 'స్పిరిట్ మీడియా' బ్యానర్, దుల్కర్ 'వేఫారర్ ఫిల్మ్స్' రెండూ కలిసి ఈ 'కాంత' చిత్రాన్ని నిర్మించనున్నాయి. అలానే ఈ మూవీలో రానా కీలక పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం దుల్కర్ 'సార్' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో సినిమా ''లక్కీ భాస్కర్'' అనే చిత్రం చేస్తున్నారు. ఈ మూవీ కంప్లీట్ అయినా వెంటనే కాంత సినిమా మొదలపెట్టబోతున్నట్లు సమాచారం. పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కబోతున్న ఈ చిత్రం తెలుగు, మలయాళంతో పాటు హిందీ, తమిళంలోనూ విడుదలయ్యే అవకాశం ఉంది.

